# రామ్ అండ్ లక్ష్మణ్ కేఫ్

**వి**మల ముత్యాలముగ్గు సినిమా చూసొచ్చిన తర్వాత, తన భర్త వెంకటేశ్‌తో అంది "అవును భగవంతుడు ప్రత్యక్షమైతే నా మేనమామ చెవులో వెంట్రుకలు యిమ్మన్నాడట! అన్న డైలాగ్ రావుగోపాలరావు ఎంత బాగా చెప్పాడండి. అసలు మేనమామ చెవులో వెంట్రుకలు వలన మేనల్లుడికి అదృష్టం కలుగుతుందా"

"ఇప్పుడు టైమ్ పన్నెండవుతోంది పడుకో రేప్పొద్దున్న చెపుతా".

పొద్దునే కాఫీతాగుతూ, "విమలా! నిన్న నువ్వు ఒక ప్రశ్న వేశావు కదా, రా చెపుతాను. మేనమామ చెవులో వెంట్రుకలుంటే మేనల్లుడికి అదృష్టమన్నది అనాదిగా వస్తున్న జోక్. కాని చెవులో ఎంత ఎక్కువ జుట్టుంటే అంత అదృష్టమని చెపుతారు. అసలు మన తెలుగు కుటుంబాల్లో మేనమామది ఒక ప్రత్యేకమైన స్థానం. ఎవడైనా చెడిపోతే 'ఎక్కడిపోతాయి వెధవ పోలికలు! అన్నీ మేనమామ బుద్ధులే' అని పిల్లల్ని తిడుతూంటారు. కొంత మంది, ఆడపిల్లలకి సంబంధం కుదుర్చుకునేటప్పుడు ప్రత్యేకంగా మేనమామ గురించి ఆరాతీస్తారు. ఏదో భగవంతుడి దయవల్ల మన కవలపిల్లలిద్దరూ ఫస్ట్‌క్లాసు తెచ్చుకుని ఇంజనీరింగ్ చదువుకుంటున్నారు. అదే మీ అన్నయ్య పోలిక వచ్చుంటే అతనిలా ఏ కాఫీ హొటలో పెట్టుకునేవారు" అన్నాడు వెంకటేశ్.

"సర్లేండి బడాయి, మా అన్నయ్యని ఏం ఎద్దేవా చెయ్యక్కర్లేదు. అసలు మా అన్నయంత నిజాయితీగా ఎవ్వరూ హొటల్ నడపలేరు. దగ్గర ఊళ్ళ నుంచి కూడా వచ్చి టిఫిన్స్ తిని పోతుంటారు. పైగా ప్రతిరోజూ సాంబారు, చెట్నీ మిగిలిపోతే, అవి పారేయిస్తాడు. అంతేకాని ఆ మర్నాడు తయారుచేసిన వాటిల్లో కలపనివ్వడు. దగ్గర్లో వున్న కాలేజీ పిల్లలంతా వచ్చి, "మామయ్య హొటల్ అంటారు" అంది విమల.

"సర్లే! మీ పుట్టింటి వాళ్ల గురించి ఏదైనా విషయం మొదలుపెడితే నీకు ఒళ్లు తెలీదు, ఇక ఆపేయి! నా ఆఫీసుకు టైమ్ అయిపోతుంది!"

"అది సరేనండి! ఈ వేసంగి సెలవులకి అన్నయ్య మన పిల్లలిద్దర్నీ వాళ్ల ఊరు పంపమన్నాడు. ఒక్కసారి పంపుదామండి, లేకపోతే బాగుండదు!"

"సరే చూద్దాం!"

వేసంకాలంలో ఓరోజు ఫోన్ చేసి, "ఏమిటే విమలా! వేసంగి సెలవులైపోతున్నాయి! రాముడు లక్ష్మణుడు ఇంకా మా ఊరు రాలేదు! అన్నాడు విమల అన్నయ్య.

"ఇంకా ఒక నెల సెలవులున్నాయి! మీ బావగారితో చెప్పి ఓ రెండ్రోజుల్లో పంపుతాన్లే అన్నయ్యా!" అంది విమల.

సాయంకాలం భర్త ఇంటికి రాగానే చెప్పింది. "ఈరోజు మా అన్నయ్య ఫోన్ చేసాడండి పిల్లలిద్దర్నీ పంపమని. ఒక్కసారి పంపుదాం!"

"సరే కానీ! ఒక పదిరోజులుండి వచ్చెయ్యమను" అన్నాడు వెంకటేశ్.

రామూడూ, లక్ష్మణుడూ మేనమామగారింటికి వెళ్ళారు. రోజు పొద్దున్నే హోటల్‌కి వెళ్ళి మధ్యాహ్నం దాకా కూర్చుని వచ్చేవారు. రాముడు వడ సాంబారూ లాగించేవాడు. లక్ష్మణుడు ఉప్మా పెసరట్టు అల్లం చెట్నీతో ఊదేసేవాడు. పాపం వాళ్ళ ఊళ్ళో అయితే, వాళ్ళ అమ్మ విమలచేసిన టిఫిన్లే తప్ప, బయట తినేవారు కాదు. "వెర్రివెధవల్లారా! ఏది కావలిస్తే అది తినండి! మొహమాట పడకండి' అనేవాడు ఆప్యాయంగా, మేనమామ.

ఒకరోజు లక్ష్మణుడు అన్నాడు "అస్తమానూ ఆ వడ సాంబారే తింటావేంట్రా! యీ ఉప్మా పెసరట్టు, అల్లం చెట్నీతో ఒక్కసారి తిని చూడు, ఇక వదలవు".

తమ్ముడు చెప్పినట్లు ఉప్మా పెసరట్టు తిన్నాడు రాముడు. "అబ్బ! మామయ్య పెసరట్టు ఏమి రుచి! ఏమి రుచి! ఏమి రుచిరా!" అని పాడుకున్నాడు.

ఒకరోజు "రవ్వదోశ కూడా తినండ్రా! వెధవల్లారా!" అన్నాడు మావయ్య. రమ్యంగా, ఆరోజు రవ్వదోశలు రెండేసి మటుమాయం చేశారు! ఇంటికి వచ్చి అత్తయ్యతో అన్నారు "మైసూరుపాక్ లంటి మా మామయ్యని చేసుకోవడం, నీ అదృష్టం అత్తయ్యా!"

"నేను మాత్రం డబుల్‌కా మీఠాని కానా" అంది అత్తయ్య, నవ్వుతూ.

"ఎవరు కాదన్నారు అత్తా! నువ్వు డబుల్‌కా మీఠావి, మీ పిల్లలు అందులోని జీడిపప్పులు " అన్నాడు లక్ష్మణుడు.

అప్పుడే వచ్చిన మావయ్యకూతుళ్ళిద్దరూ "మమ్మల్ని జీడిపప్పుతో పోల్చి తినేద్దామని చూస్తున్నారు కాబోలు, బావలు" అన్నారు.

"ఏమో నాకు ఉప్మా పెసరట్టే యిష్టం!" అన్నాడు లక్ష్మణుడు.

"నేను వడా సాంబారే తింటాను" అన్నాడు రాముడు. "నేను హార్లిక్స్ తాగను, తింటాను" అన్నమోడల్లో!

సెలవులయిపోయి, వాళ్ళ ఊరేళ్ళేసరికి, రాముడు లక్ష్మణుడూ రెండేసి కిలోల చొప్పున బరువు పెరిగారు.

తరవాత వేసం కాలం కూడా, మళ్ళీ మావయ్యగారి ఊరు వెళ్ళి, వాళ్ళకిష్టమైన ఐటమ్స్ సుష్ఠుగా తిన్నారు. ఈ వేసంకాలం మూడు కిలోల బరువు పెరిగారు.

ఈ హొటల్ తిళ్ళు తినక పూర్వం రోజూ రాత్రి పడుకుని కూడా, చదువు గురించే ఆలోచన చేసేవారు. ఇప్పుడేమో తమ మేనమావగారి హొటల్లో బాగా నచ్చిన తినుబండారాల గురించి మాట్లాడుకుంటున్నారు.

"అసలా అల్లం చెట్నీ అంత బాగా ఎలా చేస్తార్రా, ఆ హొటల్లో" అని లక్ష్మణుడంటే, "నీ మొహం అస్తమానూ ఆ ఉప్మాపెసరట్టు అల్లం చట్నీ తప్ప, యింకో ధ్యాసలేదు నీకు!" అన్నాడు రాముడు. అన్నగారు చదువు మీద ధ్యాస లేదని తిడుతున్నాడేమో అనుకున్నాడు, లక్ష్మణుడు.

"అసలా సాంబారు ఎలా చేస్తారో! రోజూ తిన్నాకానీ విసుగురాదురా! ఆ వడలు కూడా మావయ్య పెద్ద కూతురు ప్రమీల బుగ్గల్లా మిసమిసలాడి పోతుంటాయి!" అన్నాడు రాముడు.

"అసలు మామయ్య హొటల్లో పెనం కూడా, అతని రెండో కూతురు రమ జుట్టులా నల్లగా మెరిసిపోతూంటుందిరా!" అన్నాడు లక్ష్మణుడు.

"ఇక పడుకుందాం, నాన్న వింటే చంపేస్తాడు" అన్నాడు రాముడు.

" ఆ ఎన్నాళ్ళు పడివుంటాం! వింటే విననీ! మనకీ యుక్తవయస్సొస్తోంది కదా!" అన్నాడు, మీసాలు తడుముకుంటూ లక్ష్మణుడు.

ఈ తిండి ధ్యాసలోపడిన కవలల చదువు దెబ్బతింది! ఇంజనీరింగ్ మూడో సంవత్సరం, ముచ్చటగా యిద్దరు తప్పారు.

ఇంట్లో నానా రభసా అయింది! "ఆఖరికి వీళ్ళు మీ అన్నయ్యలా, ఏ కాఫీ హొటల్లో పెట్టుకునేలా ఉన్నారన్నాడు" వెంకటేశ్.

"అదే వద్దు! అస్తమానూ మా పుట్టింటి వాళ్ళను ఆడిపోసుకో వద్దు! వీళు ళ్ళ సరిగ్గా చదవకపోతే మా అన్నయ్యదా బాధ్యత!" అంది విమల.

" మీఅన్నయ్యది కాదే! వడా సాంబారూ, ఉప్మా పెసరట్టుదే!' అని కోపంగా పళ్ళు కొరికాడు వెంటేశ్".

"తిండి వలన కండ కలుగు, కండగల వాడే మనిషి" అంది విమల.

"అవును కండ వుంటే పిండి రుబ్బుకోవచ్చు!"

"నా పిల్లలు పిండి ఎందుకు రుబ్బుతారూ!"

"అవును గ్రైండర్స్ వున్నాయి కదా! ప్లేట్లు కడుగుతారు" అంటూ బయటికి కోపంగా వెళ్ళిపోయాడు వెంకటేశ్.

"విన్నారా! వెధవల్లారా! యీ ఏడాదైనా బాగా చదవండి! లేకపోతే మీ మామయ్యనీ, నన్నూ తిట్టి పోస్తారు, మీ నాన్న!" అంది విమల.

పాపం కుర్రాళ్ళు మంచి వాళ్ళే! వెంటనే 'సరే'నన్నారు. సరే అయితే అన్నారు కాని, ఆ తిండి మీద ధ్యాస పోలేదు! ఒకరోజు తెల్లారకట్ల, రాముడు, "వడా సాంబారూ" అని, లక్ష్మణుడు "ఉప్మా పెసరట్టు, అల్లం చెట్నీ యింకొంచె వెయ్యి" అంటూ కలవరిస్తూన్న తన కొడుకునిద్దర్నీ లేపి చితకబాదాడు వెంకటేశ్.

"ఇక వీళ్ళ ఇంజనీరింగ్, మీ అన్నయ్య హొటల్లో పెనంలా మసిబారిపోయిందే" అంటూ విమలకి ఒక కథ చెప్పాడు.

"పూర్వం ఒక గురువుగారు ఒక శిష్యుడ్ని, తన యింట్లోనే వుంచుకుని, అన్నం పెట్టి చదువు చెప్పాడట. కొన్నాళ్ళ తర్వాత ఒక రోజు గురువుగారి సహ పంక్తిని భోజనం చేస్తూ, గురుపత్ని వడ్డించిన చమురు వాసన చూసి, "ఏమిటి యిది ఆముదం వాసన వేస్తోంది!" అన్నాడట శిష్యుడు.

భోజనమయిన తర్వాత, "నీకిక చదువురాదు! ఈ పదేళ్లు ఆముదం వేసినా నీకు తెలియలేదు! ఇన్నాళ్లూ నీ దృష్టి చదువు మీద లగ్నమయి వుంది! కాని, యిప్పుడు నీధ్యాస తిండిమీదకి మళ్ళింది. తిండి మీద దృష్టి వున్నవానికి చదువురాదు, ఇక వెళ్ళు!" అని గురువుగారు శిష్యునికి ఉద్వాసన చెప్పారట.

పై కథ విన్న విమలకి విషయం బోధపడింది! కాని అప్పటికే పరిస్థితి చెయిజారి పోయింది. తర్వాత, కవలలు "రామ్ అండ్ లక్ష్మణ్ కేఫ్" పెట్టుకున్నారు.

(రంజని, ఉగాది, 2007)